



బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా కొట్టుకుపోయిన టి-జంక్షన్ వ్యూ పాయింట్

అలల తాకిడికి ఫ్లోటింగ్ బ్రిడ్జి తలకిందులు

మళ్లీ ఊడిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్'

- అక్కడే కొనసాగించాలని అధికారుల మొండి పట్టుదల!
- పర్యాటకులకు ఏమైనా అయితే బాధ్యత ఎవరిది?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జిపై అధికారులు మొండి పట్టుదలకు పోతున్నారు. బలమైన కెరటాల ధాటికి ఆ వంతెనకు అమర్చిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్' ప్రతి రోజూ తలకిందులు అవుతోంది. బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోతోంది.



టి జంక్షన్ వ్యూ పాయింట్ మునిగిపోయిన దృశ్యం

ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏ ముహూర్తాన ప్రారంభించారో గానీ దానిపైకి ఎవరినైనా అనుమతించాలంటేనే ఈతగాళ్లే భయపడుతున్నారు. ముంబై నుంచి వచ్చిన నిపుణుల బృందం కూడా సరైన సూచనలు చేయలేకపోయింది. శనివారం ఉదయం మరోసారి అలల వంతెన తిరగబడడంతో ఆ ప్రాంతం అంతా కల్లోలంగా మారిపోయింది. అలలు వచ్చినప్పుడు 'టి జంక్షన్ వ్యూ పాయింట్' బాగా పైకి ఎగిసిపడుతోంది. ఆ సమయంలో పొరపాటున అక్కడ ఎవరైనా ఉంటే ప్రమాదమే. ఆర్‌కే బీచ్‌లో ఎక్కడికక్కడే పదునైన బండరాళ్లు ఉన్నాయి. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో ఈ ప్రాజెక్టును పెట్టి, దానిని ఎలాగోలా నడపాలని చూడడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. తప్పును సవరించుకుని సురక్షితమైన మరోచోట ... మిగతా 6వ పేజీలో

వైసీపీ కార్పొరేటర్ భర్త దందా

అపార్టుమెంట్‌కు ఏడు గుళ్లు స్థలంలో రాత్రికి రాత్రి సీసీ రోడ్డు నిర్మాణం

- ఆ రోడ్డును ప్రధాన రహదారికి అనుసంధానించేందుకు జీవీఎంసీ నిర్మించిన ఫుట్‌పాత్ ధ్వంసం
- స్థానికులు అడ్డుకున్నా మొండిగా పనులు పూర్తి
- సీసీ రోడ్డు బయటకు కనిపించకుండా అడ్డంగా ఫ్లెక్సీలు, బైక్‌లు
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు
- ఫిర్యాదులు అందడంతో కోర్టులో వివాదం ఉన్నందున పనులు చేయొద్దంటూ బిల్డర్‌కు చెప్పి చేతులు దులుపుకున్న వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆయన ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త. పదేళ్ల కిందట నక్కవానిపాలెంలోని ఏడుగుళ్ల వెనుక కొంత స్థలాన్ని ఇద్దరి నుంచి డెవలప్‌మెంట్‌కు తీసుకుని అపార్టుమెంట్ నిర్మాణం ప్రారంభించారు. అయితే అపార్టుమెంట్‌కు చూపించిన రహదారిపై ఏడుగుళ్ల ఆలయ కమిటీకి, నక్కవానిపాలెం గ్రామస్థులకు, అపార్టుమెంట్ స్థల యజమానులకు వివాదం తలెత్తడంతో కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. దీంతో అపార్టుమెంట్ నిర్మాణం పదేళ్ల కిందటే నిలిచిపోయింది. ఆయన తాజాగా తన భార్య అధికారాన్ని అడ్డంపెట్టుకుని వివాదాస్పద స్థలంలో రాత్రికి రాత్రే సీసీ రోడ్డు నిర్మించేశారు. ఆ రోడ్డును ప్రధాన రహదారికి అనుసంధానించేందుకు జీవీఎంసీ నిర్మించిన ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేయించి ర్యాంప్ నిర్మాణం చేపట్టారు.



ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసి నిర్మించిన ర్యాంప్



ఏడుగుళ్ల స్థలంలో అపార్టుమెంటు కోసం నిర్మించిన సీసీ రహదారి

సత్యం కూడలి నుంచి సీతమ్మధార వెళ్లే రోడ్డులో నక్కవానిపాలెం ఏడు గుళ్లు ఉంది. దాదాపు 800 గజాల స్థలంలో ఆలయం ఉంది. ఆలయం వెనుక ఇద్దరు అన్నదమ్ములకు కొంత స్థలం ఉంది. ఆ స్థలాన్ని 2008లో ప్రస్తుతం వైసీపీ కార్పొరేటర్‌గా ఉన్న అప్పారి శ్రీవిద్య భర్త గిరిబాబు అపార్టుమెంట్ నిర్మాణం కోసం తీసుకున్నారు. ఆ స్థలానికి ఉత్తరం వైపు మూడు అడుగులు రహదారి మాత్రమే ఉంది. ఆ రోడ్డును చూపిస్తే అపార్టుమెంట్ నిర్మాణానికి జీవీఎంసీ అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదు. దీంతో డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన స్థలానికి తూర్పు వైపు గల ఏడుగుళ్ల స్థలాన్ని 30 అడుగులు రోడ్డుగా చూపించి 2014లో అపార్టుమెంట్‌కు ప్లాన్ తీసుకున్నారు. ప్లాన్ జారీకాగానే భవన నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టారు. ఐదు శ్లాబ్‌లు నిర్మించి, ఇటుక పనులు కూడా దాదాపుగా పూర్తవుతున్న సమయంలో ఏడుగుళ్ల స్థలంపై నక్కవానిపాలెం గ్రామస్థులకు, ఆలయ కమిటీ సభ్యులకు వివాదం తలెత్తడంతో కోర్టులో కేసులు వేసుకున్నారు. ఈ కేసులు ఇంకా కొలిక్కిరాకపోవడంతో అపార్టుమెంట్ నిర్మాణం నిలిచిపోయింది. ఇదిలావుండగా మూడు రోజుల కిందట రాత్రివేళ హఠాత్తుగా బిల్డర్ అయిన కార్పొరేటర్ భర్త అప్పారి గిరిబాబు ఏడుగుళ్ల స్థలంలో నుంచి అపార్టుమెంట్‌కు సీసీ రోడ్డు నిర్మాణం ... మిగతా 6వ పేజీలో

అధికార అరాచకం

కణమాంలో వైసీపీ నేత భూ కబ్జా

- దర్జాగా షెడ్లు నిర్మాణం
- అది డి.పట్టా భూమి
- అందులో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి పట్టాదారుని వారసులతో అధికారుల అగ్రిమెంట్
- తీరా ఇప్పుడు ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న రెవెన్యూ
- కలెక్టర్, ఆర్డీఓలకు బాధితుని ఫిర్యాదు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలంలో వైసీపీ నాయకులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతల అండదండలు చూసుకుని ప్రభుత్వ, డి.పట్టా, జిరాయితీ భూముల ఆక్రమణకు తెగబడుతున్నారు. తాజాగా మండలంలోని కణమాం గ్రామంలో డి.పట్టా భూమిలో కొంతమేర వైసీపీ నేత ఒకరు ఏకంగా షెడ్లు నిర్మించారు. మిగిలిన భూమి కబ్జాకు కూడా పావులు కదుపుతున్నారు. ఈ వ్యవహారంపై గ్రామానికి చెందిన లెంక ఈశ్వరరావు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం...



ఆక్రమిత స్థలంలో వైసీపీ నేత నిర్మించిన షెడ్లు



భూమి తనకు చెందినదిగా పత్రాలు చూపుతున్న డి.పట్టాదారుడు

కణమాంలో లెంక అచ్చిబాబుకు నాలుగు దశాబ్దాల క్రితం సర్వే నంబరు 70/2లో 1.04 ఎకరాలకు డి.పట్టా ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో అచ్చిబాబు కొన్నాళ్లు వ్యవసాయం చేసి తరువాత జీడి తోటలు వేశారు. తరువాత అచ్చిబాబు చనిపోవడంతో ఆయన కుటుంబం ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చింది. అప్పుడప్పుడు అచ్చిబాబు కుటుంబీకులు గ్రామానికి వెళ్లి ... మిగతా 6వ పేజీలో

5, 7 తేదీల్లో సీఎం రాక



- 5న నగరంలో పారిశ్రామిక సదస్సు
- 7న అనకాపల్లిలో 'చేయూత' కార్యక్రమం

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల ఐదు, ఏడు తేదీల్లో నగరానికి రానున్నారు. ఈనెల ఐదో తేదీన 'విజన్ వైజాగ్' పేరుతో భీమిలి బీచ్‌రోడ్డులోని రాడిసన్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో నిర్వహించనున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన శాఖ పీఎం పాలెంలోని వి.కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అలాగే ఈనెల ఏడో తేదీన మరోమారు సీఎం విశాఖ రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా అనకాపల్లి వెళతారు. 'చేయూత' పథకం నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల ఐదో తేదీన నగరంలో సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు.

అక్కరకు రాని విద్యా హక్కు చట్టం

- ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత విద్య ఒట్టిదే?
- అమ్మఒడి తీసుకున్నవారంతా ఫీజు చెల్లించాల్సిందే
- ప్రభుత్వ నిర్ణయంపై తల్లిదండ్రుల అసంతృప్తి

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఉచిత విద్య ఒట్టిదేనని తేలిపోయింది. వీరంతా ప్రభుత్వం నుంచి అందుకున్న అమ్మఒడి సాయం సంబంధిత పాఠశాలలకు ఫీజులు చెల్లించేలా అధికారులు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం కలకలం రేపుతోంది.

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాలల్లోని ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. దీనిపై చాలాకాలం తర్జన భర్జనలు జరిగిన అనంతరం 2022-23 విద్యా సంవత్సరంలో తొలిసారిగా ప్రవేశం కల్పించారు. ఈ క్రమంలో జిల్లాలో సుమారు 600 ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాలలుండగా సీట్ల కోసం ఎంతోమంది దరఖాస్తు చేసుకున్నా కేవలం 65 మందికే ప్రవేశం కల్పించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మాత్రం 1,227 మందికి సీట్లు కేటాయించారు.

పది వేల మందికి వీలున్నా...

వాస్తవంగా జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అంటే సుమారు పది వేల మంది పేద విద్యార్థులకు అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ 1,227 మందికి మాత్రమే అవకాశం దక్కింది. విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు పొందిన పట్టణ ప్రాంత విద్యార్థులైతే ఏడాదికి రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాలైతే రూ.6,500, గిరిజన ప్రాంతాలవారు రూ.5,100 చొప్పున పాఠశాలలకు ఫీజు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవంగా ఈ మొత్తం ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. అయితే అమ్మఒడి సొమ్ముతో దీనికి ముడిపెట్టింది. గత విద్యాసంవత్సరంలో సీట్లు పొందిన 65 మందిలో ఇప్పటివరకు 22 మంది ఆయా పాఠశాలలకు ఫీజులు చెల్లించారు. మిగిలిన వారిలో కొందరికి అమ్మఒడి సొమ్ము అందలేదు. వారి ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలి. కానీ దానిపై ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఇదిలావుండగా విద్యా హక్కు చట్టం కింద సీట్లు పొందిన ప్రతి విద్యార్థి నుంచి రెండు, మూడు రోజుల్లో ఫీజులు వసూలు చేయించాలని సమగ్ర శిక్ష అభియాన్ అధికారులకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో సంబంధిత అధికారులు ఇదేమి చిక్కంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్లలో సీట్లు పొందిన 1,227 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ ఏడాది జూన్‌లో అమ్మఒడి డబ్బులు జమయ్యే అవకాశం ఉంది. అప్పటివరకు వీరంతా ఫీజులు చెల్లించనవసరం లేదని ప్రభుత్వం చెబుతున్నా, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. ఒకవేళ ఎన్నికల తరువాత అమ్మఒడి ఇవ్వకపోతే ఫీజుల సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నాయి.

ఏపీపీ గాయత్రి హఠాన్మరణం

నగరంలోని నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న గాయత్రి (58) శనివారం గుంటూరులో గుండెపోటుతో మృతిచెందారు.

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన -మెయిన్‌లో

- పాట్నా నుంచి వర్చువల్‌గా కార్యక్రమం...

రౌడీషీటర్లపై ఉక్కుపాదం



నిరంతరం నిఘా పెట్టాల్సిందిగా సీఐలకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు

- ఎక్కడైనా పొరపాటు జరిగితే సంబంధిత కానిస్టేబుళ్లను కూడా బాధ్యులను చేస్తానంటూ హెచ్చరిక
- స్టేషన్‌ల వారీగా వివరాల సేకరణ

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రౌడీషీటర్లపై పోలీసులు ఎట్టకేలకు దృష్టిసారించారు. కొంతమంది రౌడీషీటర్లు తరచూ నగరంలో ఎక్కడో ఒకచోట దాడులు, దౌర్జన్యాలకు దిగడంతోపాటు భూ వివాదాల్లో తల దూరుస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్నిసార్లు హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి.

రౌడీషీటర్లకు ప్రతి ఆదివారం పోలీసులు తూతూమంత్రంగా కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించేస్తున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరుకానివారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రౌడీషీటర్లలో దూకుడుగా ఉన్నవారిని, దందాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు నిత్యం జైల్లోనే ఉండేలా చర్యలు తీసుకునేవారు. ఒక కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత రౌడీషీటర్ల కదలికలను నిరంతరం గమనించే బాధ్యతను ఒక కానిస్టేబుల్‌కు అప్పగించేవారు. బెయిల్‌పై వచ్చిన రౌడీషీటర్ల మళ్లీ ఇతర రౌడీషీటర్లతో కలిసి తిరిగినా, ఎవరినైనా బెదిరించినా కేసు నమోదుచేసి తిరిగి జైలుకు పంపించేవారు. దీనివల్ల రౌడీషీటర్లలో భయం ఏర్పడి వివాదాల జోలికి వెళ్లేందుకు సాహసించేవారు కాదు. కానీ గతకొంతకాలంగా రౌడీషీటర్లపై పోలీసుల నిఘా కొరవడిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. పోలీసులకు ఇతర విధులు పెరిగిపోవడంతో రౌడీషీటర్లపై దృష్టి పెట్టేందుకు వీల్లేకుండాపోయింది. దీంతో రౌడీషీటర్లు మళ్లీ గతంలో మాదిరిగా బెదిరింపులు, దందాలు మొదలుపెట్టారు. తాజాగా పాతనగరానికి చెందిన దండుపాళ్యం గ్యాంగ్ నాయకుడు దోని సతీష్ అలియాస్ గసగసాలు డమ్మీ తుపాకీ చూపించి ఇతరులను బెదిరించి ... మిగతా 6వ పేజీలో

ఉక్కు పోరాటం

- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు మహా పాదయాత్ర
- స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకూ నిర్వహణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 2:

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆదివారం మహా పాదయాత్ర నిర్వహిస్తున్నది. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంటు ఆర్చ్ వద్ద నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న నిరసన శిబిరం వరకూ ఈ పాదయాత్ర జరగనున్నది. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్‌లతో పాదయాత్ర చేపడుతున్నట్టు కమిటీ నాయకులు వెల్లడించారు. ఉదయం ఆరు గంటలకు స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద గల రిలే నిరాహారదీక్ష శిబిరం నుంచి పాదయాత్ర ప్రారంభం కానుంది. శ్రీనగర్, పాత గాజువాక, బీహెచ్‌పీవీ, షీలానగర్, ఎయిర్‌పోర్టు, ఎన్ఏడీ జంక్షన్, 104, దొండపర్తి మీదుగా జీవీఎంసీ వరకూ సాగనున్నది. పాదయాత్రలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు.

కలగా హైస్కూల్ ఏర్పాటు

- కొండవాలు గ్రామాలకు అందని ఉన్నత పాఠశాల విద్య
- అప్‌గ్రేడ్‌కు నోచని రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల
- సమస్య పట్టించుకోని పాలకులు, అధికారులు


రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల

కంచరపాలెం, మార్చి 2: జీవీఎంసీ 46,47,48వ వార్డుల పరిధి కొండవాలు గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత పాఠశాల అందుబాటులో లేకపోవడంతో చాలామంది మధ్యలోనే బడికి దూరమవుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా కొండవాలు గ్రామాల్లో అమలుకావడం లేదు. కప్పరాడ, రాంజీ ఎస్టేట్, బాపూజీ నగర్, కైలాసపురం, స్లీపర్ కాలనీ, ఇందిరానగర్ తదితర గ్రామాలకు సంబంధించి రాంజీ ఎస్టేట్‌లో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అందుబాటులో ఉంది. గతంలో ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి కనీసం అప్పర్ ప్రైమరీ పాఠశాలగామార్చాలని స్థానికులు అధికారులకు, నాయకులకు పలువురు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హయాంలో ఇక్కడ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అనేక వినతులు వచ్చాయి. అయితే,నేటికీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే విధంగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఐదో తరగతి వరకు పిల్లలు పాఠశాల్లో చదివి తరువాత ఉన్నత పాఠశాల అందుబాటులో లేక మధ్యలో మానేస్తున్నారు.

ఉన్నత పాఠశాల కోసం హైవేను దాటాల్సిందే..

కొండవాలు గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలకు వెళ్లాంటే కంచరపాలెం మెట్టు వద్ద ఉన్న జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలో చేరాలి. ఆ పాఠశాలకు వెళ్లాలంటే మధ్యలో ఉన్న హైవేను దాటాల్సి ఉంది. ఇలా జాతీయ రహదారిని దాటి వెళ్లేటప్పుడు వాహనాల ఢీకొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు భయపడి విదార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. గతంలో ఇలా ప్రమాదాల బారిన పడి పలువురు ప్రాణాలను కూడా కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అవకాశం ఉన్నవారు ఏదైనా ప్రైవేట్ పాఠశాలలో చేరుతున్నారు. కొండవాలు గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రజల్లో అధికశాతం నిరుపేదలు కావడంతో చాలా మంది బడిబయటే ఉంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు, అధికారులు దృష్టిని సారించి రాంజీ ఎస్టేట్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని, కనీసం అప్పర్ ప్రైమరీ పాఠశాలగానైనా అప్‌గ్రేడ్‌చేస్తే కొంతవరకు చదువుకునే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుజాత

సీతంపేట, మార్చి 2: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో ర్యాలీని నిర్వహించారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య అతిథిగా ప్రాంతీయ వైద్య ఆరోగ్యసంచాలకులు బి.సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.జీవన రాణి, జిల్లా ప్రోగాం అధికారులు బి.నాగేశ్వరరావు, ధర్మేంద్ర ఉన్నారు.

నేడు పల్స్ పోలియో కార్యక్రమం

- జిల్లాలో 2,08,163 మంది చిన్నారులు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం పల్స్ పోలియా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు వయసున్న 2,08,163 మంది చిన్నారులకు 1,002 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. ఇందుకోసం 74 మొబైల్ బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలకు టీకా డోసులు పంపిణీ చేశామని, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డెమో నాగేశ్వరరావుతో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వివరించారు.

వైసీపీ కార్పొరేటర్ భర్త దందా

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేశారు. విషయం తెలియగానే నక్కవానిపాలెం గ్రామస్థులు అక్కడకు చేరుకుని గొడవకు దిగారు. అయినప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. దీనిపై గ్రామస్థులు ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజుకు, స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డికి ఫిర్యాదు చేయగా...వారంతా వెళ్లి కోర్టులో కేసు ఉన్నందున పనులు చేపట్టవద్దని బిల్డర్‌ను ఆదేశించి వెళ్లిపోయారు. మరుసటిరోజు రాత్రి మళ్లీ బిల్డర్ అక్కడకు చేరుకుని తాను అపార్టుమెంట్ కోసం నిర్మించిన సీసీ రోడ్డును నక్కవానిపాలెం ప్రధాన రహదారికి అనుసంధానించేందుకు వీలుగా జీవీఎంసీ నిర్మించిన ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసి, వాహనాలు సులభంగా అపార్టుమెంట్‌వైపు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులను నిర్మించారు. దీంతో గ్రామస్థులు మరోసారి అక్కడకు చేరుకుని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడకు చేరుకుని కోర్టులో వివాదం కొలిక్కి వచ్చేంత వరకూ ఎలాంటి పనులు చేపట్టవద్దని చెప్పి...అక్కడి నుంచి వెనుతిరిగిపోయారు. ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేయడంతోపాటు మెయిన్‌రోడ్డుపై కాంక్రీట్ వేసి ర్యాంప్ నిర్మించారనే కారణంతో క్రిమినల్ కేసు పెట్టాల్సి ఉన్నప్పటికీ బిల్డర్ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త కావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం దాల్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ కావడంతో బిల్డర్ బరితెగించి వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై బిల్డర్, వైసీపీ కార్పొరేటర్ భర్త అప్పారి గిరిబాబు వివరణ కోరగా, ఏడుగుళ్ల అనుకుని ఉత్తరం వైపు నుంచి 30 అడుగులు రోడ్డు ఉన్నందున అది చూపించి జీవీఎంసీ నుంచి 2014లో అపార్టుమెంట్ నిర్మాణానికి ప్లాన్ పొందామన్నారు. దీనిపై గ్రామస్థులతోపాటు మరికొందరు కోర్టులో కేసులు వేసినప్పటికీ తామే గెలిచామన్నారు. తాజాగా రోడ్డు నిర్మించడంతో కొంత మంది తాగుబోతులు కావాలనే గొడవకు దిగుతున్నారన్నారు. కోర్టులో కేసులు గెలిచినప్పుడు అపార్టుమెంట్ నిర్మాణం ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించగా, తనకు డెవలప్‌మెంట్‌కు స్థలం ఇచ్చిన వారు ఎక్కువ ఫ్లాట్‌లు కావాలని డిమాండ్ చేశారని, దీనివల్ల గొడవ వచ్చి నిర్మాణం ఆగిందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి వివాదం లేకపోతే బయటకు కనిపించకుండా ఫ్లెక్సీలు, పాతవాహనాలను అడ్డంగా ఎందుకు పెట్టారని ప్రశ్నించగా...రాత్రిపూట గంజాయి బ్యాచ్‌లు, మందుతాగేవారు అపార్టుమెంట్ వైపు వెళ్లకుండా పెట్టామని సమాధానం చెప్పడం గమనార్హం.

అలల తాకిడికి ఫ్లోటింగ్ బ్రిడ్జి తలకిందులు

... 5వ పేజీ తరువాయి

పెట్టుకోవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఇంకొక దగ్గరకు మార్చాలంటే అనుమతులు అవసరమవుతాయని, దానికి జాప్యం జరుగుతుందని ఆలోచన చేస్తున్నారు. ఆర్కే బీచ్ వద్ద సముద్రం ప్రశాంతంగా ఉండడం చాలా అరుదు. అలలు తీరాన్ని ఢీకొడుతూనే ఉంటాయి. అక్కడే ఫ్లోటింగ్ బ్రిడ్జిని కొనసాగించాలనే ప్రయత్నం కంటే..సురక్షితమైన ప్రాంతంలో నిర్వహించడం ఎంతో మేలు. ఈ ప్రాజెక్టు కారణంగా పర్యాటకులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఇవీమీ అధికారులకు అర్థం కావడం లేదు.

అధికార అరాచకం

... 5వ పేజీ తరువాయి

భూమిలో ఉన్న జీడిచెట్ల ఫలసాయం తీసుకుంటూ ఉండేవారు. ఇదిలావుండగా గ్రామానికి రైతుభరోసా కేంద్రం మంజూరుకావడంతో నిర్మాణానికి రహదారికి అనుకుని ఉన్న 70/2లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామంలో వైసీపీ నేతలు చెప్పారని 1.04 ఎకరాల్లో 30 సెంట్లు రైతుభరోసా కేంద్రం ఏర్పాటుకు ఇవ్వడానికి అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు ముందుకువచ్చి అగ్రిమెంటు రాసి ఇచ్చారు. దీంతో రైతుభరోసా కేంద్రం నిర్మించిన వైసీపీ నేత, అక్కడే సుమారు 10 నుంచి 15 సెంట్లలో సొంతంగా రేకుల షెడ్లు నిర్మించారు. దీనిపై అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు అభ్యంతరం చెబుతూ ఆనందపురం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత తన భూమిలో కొబ్బరి మొక్కలు నాటుకున్నారు. అయితే...వైసీపీ నేత రేకుల షెడ్లు నిర్మించినప్పుడు స్పందించని రెవెన్యూ అధికారులు... ఈశ్వరరావు నాటిన కొబ్బరి మొక్కలు తొలగించి అది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డు పాతారు. ప్రస్తుతం పాతిన బోర్డును తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడానికి వైసీపీ నేత రంగం సిద్ధం చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ కీలక నేతల ఆశీస్సులు ఉండడంతో సర్వేనంబరు 70/2లో మిగిలిన భూమి కబ్జాకు యత్నిస్తున్నారని డి.పట్టా పొందిన రైతు వారసుడు ఈశ్వరరావు రెండు రోజుల కిందట జిల్లా కలెక్టర్, భీమిలి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అయితే సర్వేనంబరు 70/2లో భూమి ప్రభుత్వ భూమి అని ఆనందపురం రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు లెంక అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు నుంచి 30 సెంట్లు భూమి రైతుభరోసా కేంద్రానికి ఎందుకు తీసుకున్నట్టు?... ఇంకా అక్కడే గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత షెడ్లు నిర్మించినప్పుడు ఎందుకు అడ్డుచెప్పలేదు?...అంటే సమాధానం లేదు. సర్వే నంబరు 70/2లో రైతు భరోసా కేంద్రం నిర్మించగా మిగిలిన 60 సెంట్లను కాజేయడానికి వైసీపీ నేతతో రెవెన్యూలో కొందరు స్కెచ్ వేశారా?...అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, జిల్లా కలెక్టర్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గ్రామస్థులు అంటున్నారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

డబ్బులు గుంజుతున్నట్టు ఫిర్యాదు అందడంతో అతడితోపాటు అతని అనుచరుడైన మనోజ్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి డమ్మీ తుపాకీతోపాటు పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు మరి కొందరు రౌడీషీటర్లపై కూడా ఫిర్యాదులు అందుతుండడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా పెట్టాలని సంబంధిత స్టేషన్ల సీఐలను ఆదేశించారు. ఒకవేళ రౌడీషీటర్ ఏదైనా నేరంలో పాల్గొన్నట్టు తేలితే సంబంధిత స్టేషన్ సీఐతో పాటు బాధ్యుడైన కానిస్టేబుల్‌పై కూడా చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. దీంతో అన్ని స్టేషన్ల పరిధిలోనూ రౌడీషీటర్ల జాబితాతోపాటు ఎవరెక్కడ ఉంటున్నారనే వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



విశాఖ నా పుట్టిల్లు

- వైసీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయ కర్త బొత్స ఝాన్సీ


కనకమమహాలక్ష్మి పూజల్లో బొత్స ఝాన్సీ, మంత్రి అమర్‌నాథ్ తదితరులు

జగదాంబ కూడలి, మార్చి 2: 'విశాఖ నగరం నా పుట్టిల్లు.. ఈ నేపథ్యంలో ఈ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి తప్పక గెలుస్తాను' అని వైసీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఎంపీగా వైసీపీ నుంచి పోటీ చేయనున్నానని, ఇక్కడి ప్రజలు తనను గెలిపిస్తారన్నారు. విలేకరులకు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా విశాఖకు తాను వలస రాలేదని, ఇది తాను పుట్టిన ఊరని ఆమె తెలిపారు. అర్చకులు సమక్షంలో బొత్స ఝాన్సీ కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే వాసుపల్లి, నాయకులు, కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

నేడు మురళీనగర్‌లో ప్రచారానికి శ్రీకారం

మురళీనగర్; విశాఖ ఎంపీగా రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్న బొత్స.ఝాన్సీ ఆదివారం మురళీనగర్ నుంచి ఎన్నికల ప్రచారం ఆరంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్‌జీజీఓస్ కాలనీ శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేపట్టి, అక్కడి నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్టు నాయకులు తెలిపారు. అనంతరం మధుసూదన్‌నగర్, కస్తూరినగర్ ప్రాంతాల నుంచి ప్రజల్లోకి వెళ్లనున్నారు.

సూక్ష్మ పరిశ్రమలపై సర్వే పరిశీలన


ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల కార్యదర్శి యువరాజు

కంచరపాలెం, మార్చి 2 : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు మెరుగుపరచటం, పరిశ్రమల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై అభిప్రాయాలను సేకరించే నిమిత్తం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజు శనివారం కంచరపాలెంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలకు సంబంధించి సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి ఉన్నారు.

'ఇంటర్ విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి'

అక్కయ్యపాలెం, మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదరాబాదరాగా పరీక్ష కేంద్రాలకు అతి కష్టంగా చేరుకుంటున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ పరీక్షల ఆలస్యంగా చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లకు కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

నేడు బుల్లయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు


మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార, మార్చి 2: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఉన్నత సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ విద్యనందించి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకునేలా తీర్చిదిద్దామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అన్నారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1973లో కేవలం రెండు తరగతి గదులతో 230 మంది విద్యార్థులతో కళాశాలను ప్రారంభించామన్నారు. అనంతరం దశ దిశలా అభివృద్ధి చెందిందన్నారు. అలాగే, ఈ 50 ఏళ్ల వేడుకలకు 4,500 మందికిపైగా విద్యార్థులు స్వాగతం పలుకునున్నారన్నారు. ఐదు దశాబ్దాలపాటు విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేశామన్నారు. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు భరత్, వేణుగోపాల్ ఇండియన్ క్రికెట్ టీమ్‌లో ఆడారన్నారు. ఏపీలో అతి పెద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాన్ని కలిగి ఉందన్నారు. ప్రస్తుతం తమ కళాశాల ఆంధ్రా యూనివర్శిటీ అనుబంధంగా ఎన్ఏఏసీ వారి ఏ గ్రేడ్ అక్రిడేషన్ కలిగి స్వయం ప్రతిపత్తి హోదాలో ఉందన్నారు. కళాశాల స్వర్ణోత్సవాలు గ్రాండ్ ఫినాలేతో ముగుస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, రీయాజ్ మహ్మద్, డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వర రెడ్డి, పూర్వ విద్యార్థులు అబ్దుల్ హమీద్‌ఖాన్, విద్యాసాగర్, అమీద్ బట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

'బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాలి'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భిక్షువు రాజధమ్మా, ఇతరులు

సీతంపేట, మార్చి 2: బుద్ధుని జీవితంతో పెనవేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందని మాజీ వీసీ పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కేఎస్ చలం రచించిన బౌద్ధ విజ్ఞానం- లౌకిక జీవనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ ఫిలాసఫీ శాఖాధిపతి ప్రొఫెసర్ వి.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మయన్మార్‌కు చెందిన భిక్షువు రాజధమ్మా విచ్చేశారు. అనేక పుస్తకాలు, పరిశోధన గ్రంథాలు పరిశీలించి ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచినట్లు చలం అన్నారు. మాజీ వీసీ ముత్యాల నాయుడు, ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు, వై. విజయకుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ సత్యనారాయణ మూర్తి, మాటూరి శ్రీనివాస్, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

హరిరామజోగయ్య తీరు సరికాదు: జనసేన


మాట్లాడుతున్న జనసేన పార్టీ సమన్వయ కర్త నాగలక్ష్మి

సీతంపేట, మార్చి 2: ఎంపీ హరిరామజోగయ్య రాష్ట్ర ప్రజల మంచిని కోరుకోవాలని, కానీ, ఆయన వైసీపీ అరాచకాలకు కొమ్ము కాస్తుండడం శోచనీయమని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్తలు కిరణ్ ప్రసాద్, నాగలక్ష్మి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. ఇన్ని రోజులూ ఆయన మాట్లాడిన మాటలకు, ఆయన రాసిన లేఖలకు వారి కుమారుడు వెళ్లి వైసీపీ కండువా కప్పుకోవడంతో ఆయన ఉద్దేశమేమిటో తేట తెల్లమైందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంటే అది మంచిది కాదని చెప్పాల్సింది పోయి ఆయన అధికార వైసీపీకి వంతపాడడం దుర్మార్గమన్నారు. కాపుల అభివృద్ధి కోసం పాటుపడాలనుకుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు బాసటగా నిలబడాలన్నారు. రాజకీయ దురుద్దేశంతో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. నేతలు సోమశేఖర్, చైతన్య, భార్గవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్: ఏడీసీపీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీతమ్మధార, మార్చి 2: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఏడీసీపీ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సత్యం జంక్షన్‌లో ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎన్‌వీ భాస్కరరావు, ట్రాఫిక్ సిబ్బంది, పాత్ర అనే సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై ప్లకార్డుల ప్రదర్శనను నిర్వహించారు. సిగ్నల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వారికి ఏడీసీపీ చేతుల మీదుగా స్టీల్ వాటర్ బాటిల్‌ను బహుమతిగా ఇచ్చారు.

వేణుగోపాలస్వామి ఆలయ అర్చకునిపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న దేవదాయ శాఖ ఏసీ శిరీష

అక్కయ్యపాలెం, మార్చి 2: అక్కయ్యపాలెం వేణుగోపాల స్వామి ఆలయం అర్చకులు పీవీ అప్పలచార్యులుపై శనివారం ఆలయం ఆవరణలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష ఆధ్వర్యంలో ప్రజా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏసీ శిరీష మాట్లాడుతూ అర్చకుడు కార్తీకమాసంలో ఆకాశ దీపం పెట్టలేదని, అష్టోత్తరం పూర్తిగా చెప్పలేక పోతున్నారనే ఆరోపణలపై విచారణ చేశామన్నారు. దీనిపై అతనిని సంజాయిషీ కోరగా, సమాధానం చెప్పకుండా విచారణ మధ్యలో వెళ్లిపోయారన్నారు. ఆ తరువాత వారి కుటుంబసభ్యులు వచ్చి, అప్పలచార్యులు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేశారని బెదిరిస్తూ, వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేశారన్నారు. దీనిపై నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తామన్నారు. విచారణలో ఆలయ ఛైర్మన్ వై.దేముడు, ధర్మకర్తల మండలి సభ్యులు చంద్రకళ, కేఎస్‌కేఎస్ సూర్యకళ, ఈవో పి.సత్యనారాయణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

'బయటకు పంపించేందుకే కుట్ర'

తన తండ్రి 1984 నుంచి అర్చకునిగా పనిచేస్తున్నారని పీవీ అప్పలచార్యులు కుమారుడు లక్ష్మీనారాయణ తెలిపారు. కమిటీ సభ్యులు ఎలాగైనా తన తండ్రిని బయటకు పంపాలని నిర్ణయించుకుని ఫిర్యాదులు చేశారన్నారు. ఆలయ ఛైర్మన్‌తోపాటు మరో ముగ్గురు వేధిస్తున్నారన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 2: స్థానిక భీమునిగుమ్మంకు చెందిన డాక్‌యార్డు ఉద్యోగి గొర్లి దివాకర్ (32) శనివారం మృతి చెందారు. పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ అందించిన వివరాలివి.. అవివాహితుడైన దివాకర్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ తన మేనత్త ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం విధులకు వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఆరు గంటలకు కాఫీ తాగిన అనంతరం బయటకు వెళ్లి వచ్చాడు. తర్వాత నోటి నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని మృతుని సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 2: ప్రాథమిక విద్యార్థి దశ నుంచి చిన్నారులకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆర్టీఎన్ ఆశాజాస్తి, ఆర్టీఎన్ కరుణ పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, విద్య , పౌష్టికాహారం, ఆరోగ్యం అంశాలపై రోటరాక్ట్ క్లబ్ వైజాగ్ కపుల్స్ , సన్ ఇంటర్నేషనల్ నిర్వహణలో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ యూత్ సర్వీస్ బృందం అవగాహన కల్పించింది. విద్యార్థులకు ఆట వస్తువులు, పౌష్టికాహార ప్యాకెట్స్‌ను అందజేశారు.

'సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం'

సీతమ్మధార, మార్చి 2: సంక్షేమ పథకాలు పంపణీలో వలంటీర్లు పాత్ర కీలకమని వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పేర్కొన్నారు. నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం ఆవరణలో 14, 24, 25వ వార్డుకు సంబంధించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానంచేశారు. కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మరెడ్డి, సారిపల్లి గోవింద్, మురళీకృష్ణ రెడ్డి, ఏపీడీ దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ...

కంచరపాలెం: జీవీఎంసీ 47,48వ వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను కె.కె. రాజు శనివారం పంపిణీ చేశారు. సుగుణకుమార్, కంటిపాము కామేశ్వరి, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ

జ్ఞానాపురం, మార్చి 2: జ్ఞానాపురంలో లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా‌శ్రీధర్ ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ యూసీడీ సీవో సత్యవతి, సచివాలయ సిబ్బంది లక్ష్మీనారాయణ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాస్టర్ ట్రైనీలకు సూచనలిస్తున్న ఈఆర్వో శేష శైలజ

ఎన్నికల నిర్వహణలో మాస్టర్ ట్రైనీల పాత్ర కీలకం

పెందుర్తి ఈఆర్వో శేష శైలజ

పెందుర్తి, మార్చి 2: ఎన్నికల నిర్వహణలో మాస్టర్ ట్రైనీల పాత్ర కీలకమని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎన్నికల మాస్టర్ ట్రైనీలు, తహసీల్దార్లతో ఎన్నికల పక్రియ, ఈవీఎంల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలోని 282 పోలింగ్ బూత్‌లకు 27 మంది సెక్టార్ల అధికారులు, 27 మంది పోలీసు అధికారులు ఉన్నారన్నారు. ఈ 54 మంది సమన్వయంగా వ్యవహరిస్తూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఈఆర్వోకు అనుసంధానమై ఉంటారన్నారు. ఈ ప్రకియలో ఉన్నత, క్షేత్ర స్థాయి సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వాలన్నారు. ,శిక్షణలో గల అంశాలను క్రోడీకరించి పోస్టల్ బ్యాలెట్, ఆన్‌లైన్ ఓటింగ్ నమోదు, ఎన్‌సీసీ, పీసీలకు శిక్షణ అందజేయాలన్నారు, పోలింగ్‌పై మాస్టర్ ట్రైనీలు మాన్యువల్, టెక్నికల్ అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మొదటి విడత శిక్షణ పూర్తి చేసిన వారి నివేదికను ఈఆర్వో పరిశీలించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో కొత్తగా నమోదైన ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సమావేశంలో పెందుర్తి, పరవాడ, సబ్బవరం తహసీల్దార్లు బంగార్రాజు, గణపతిరావు, చలమయ్య, డీటీ కల్యాణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

సింధియా, మార్చి 2: పిలకవానిపాలెం సెయింట్ ఆంధ్రూస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నగరంలో పెరుగుతున్న కాలుష్యం, రోడ్డు భద్రత, ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్, వ్యవసాయం, ఆర్గానిక్ వ్యవసాయం, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించేందుకే వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ ఎస్.రాధిక, కరస్పాండెంట్ విశ్వేశ్వరరావు తెలిపారు.

పల్స్ పోలియోపై ప్రచారం

కూర్మన్నపాలెం, మార్చి 2: కణితి పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని డాక్టర్ టి.శివయ్య కోరారు. ఈ మేరకు శనివారం పీహెచ్‌సీ వద్ద ఆటో ద్వారా ప్రచారం చేశారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వలంటీర్లకు ఆయన పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు.

బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన బోధి గురు

గాజువాక, మార్చి 2: గాజువాకలోని బీజేపీ కార్యాలయాన్ని బోధి గురు బిక్కు బోధి హిన్ శనివారం సందర్శించారు. దక్షిణ భారతదేశ యాత్రలో ఉన్న ఆయన ఇక్కడి పార్టీ కార్యాలయాన్ని సందర్శించి పలువురితో మాట్లాడారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు శ్రీనివాసరాజు, రమణయ్య, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి.
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 20, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 60, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీర దోస 28, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
ఫారం ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

ప్రచారానికి శ్రీకారం చుట్టిన గణబాబు

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

అత్యధిక మెజారిటీతో చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతా: 'పశ్చిమ' ఎమ్మెల్యే


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

ఆర్పీపేట (కంచరపాలెం), మార్చి 2: ఎన్నికల ప్రచారానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రచారాన్ని శనివారం జనసేన నాయకులు,కార్యకర్తలుతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ముందుగా తమ ఆరాధ్య దైవం పైడితల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారాన్ని ప్రారంభించారు. పైడిమాంబ కాలనీ, రామ్మూర్తి పంతులపేట, గవర కంచరపాలెం, తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజల జీవనం ఛిన్నాభిన్నంగా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కుంటిపడడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్పీపేట, చాకలిగెడ్డ ప్రాంతాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నా, ఇప్పటికీ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అప్పగించడంలో వైసీపీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ఎన్నికల్లో కన్నా అధిక మెజారిటీని సాధించి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతానన్నారు. కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'సూపర్ సిక్స్' చేరాలి

గోపాలపట్నం: తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ 6 అంశాలను ఇంటింటికీ చేరవేయాలని ఎమ్మెల్యే గణబాబు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గోపాలపట్నంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరికీ వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ


దీక్షా శిబిరంలో కూర్చున్న ఆదినారాయణ, తదితరులు


..మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకుడు విల్లా రామ్మోహన్‌కుమార్

కూర్మన్నపాలెం, మార్చి 2: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వరకు చేపట్టనున్న పాదయాత్రలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుంటే తాము పోరాటాలతో ఎదుర్కొంటున్నామన్నారు. లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా దొడ్డిదారిన అనేక ఆటంకాలు సృష్టిస్తున్న కేంద్రానికి కనువిప్పు కలిగేలా పాదయాత్రలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. దేశ సంపదను అదానీ,అంబానీలకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. నాయకుడు సన్యాసిరావు మాట్లాడుతూ దేశ సంపదను రక్షించుకునేందుకు పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టనున్న మహా పాదయాత్రను సక్సెస్ చేయాలని నిర్వాసిత సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. నిర్వాసితులను సమాయత్తం చేసేందుకుగాను సంఘం సభ్యులు శనివారం పెదగంట్యాడ, నెల్లిముక్కు, బాలచెరువు, శీకువానిపాలెం, సీతానగరం, దుర్గవానిపాలెం, సిద్దేశ్వరం ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను పెదగంట్యాడ కూడలిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, దొమ్మేటి అప్పారావు, శ్రీముసిరి శ్రీనివాసరావు, టి.జగదీశ్, కణితి అప్పలరాజు, నమ్మి అప్పారావు, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు టీఎన్‌టీయూసీ మద్దతు

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం చేపడుతున్న పాదయాత్రకు టీఎన్‌టీయూసీ సంపూర్ణ మద్దతు తెలపడంతో కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీలు తమ మేనిఫెస్టోలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను చేర్చే విధంగా పాదయాత్ర చేపడుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు పంచదార్ల ఉగ్రం, పెంటారావు, మణి కుమార్,సత్యనారాయణ,రామయ్య,వర్మ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు


లబ్ధిదారులకు నమూనా తాళం అందజేస్తున్న సుబ్బారెడ్డి, ఆదారి

గోపాలపట్నం, మార్చి 2: జీవీఎంసీ92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయంలో శనివారం సామూహిక గృహప్రవేశాలను లబ్ధిదారులతో చేయించారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి 836 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, తాళాలను అందజేశారు. లబ్ధిదారులకు ఆనంద్‌కుమార్ పట్టు వస్త్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ఏ రెహమాన్, మళ్ల విజయప్రసాద్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివదేవి, తదితరులు పాల్గొన్నారు.

వసతులు లేకుండానే..

కాగా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించకుండా టిడ్కో ఇళ్లను పంపిణీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఇళ్లకు మంచినీరు, విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. వసతులు లేకున్నా ఎన్నికలు సమీపిస్తున్నందున ఆగమేఘాలపై పంపిణీ చేపట్టారని పలువురు విమర్శిస్తున్నారు.

ములగాడలో..

మల్కాపురం: ములగాడలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులైన 316 మందితో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ గృహప్రవేశాలు చేయించారు. లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంతో సమానంగా గాజువాకను అభివృద్ధి చేస్తా..

మేయర్ హరి వెంకటకుమారి


76వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ/గాజువాక, మార్చి 2: విశాఖ నగరంతో సమాంతరంగా గాజువాక ప్రాంతం అభివృద్ధి చేస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. 76వ వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు శనివారం ఆమె శంకుస్థాప చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ 'గాజువాక' ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు టి.సత్యనారాయణ, ఆర్.నారాయణమూర్తి, జి.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అగనంపూడి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. 79వ వార్డు పరిధి గౌరీనగర్‌లో రూ.55 లక్షల వ్యయంతో బస్ట్ స్టేషన్ నిర్మాణం, గల్లవానిపాలెంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, ప్రశాంతినగర్‌లో రూ.16 లక్షలతో రిటెయినింగ్ వాల్స్ నిర్మాణానికి ఆమె ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ శత శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, వైసీపీ 'గాజువాక' ఇన్‌చార్జి ఉరుకూటి చంద్, తదితరులు పాల్గొన్నారు.



గోశాల కూడలిలో పాన్‌షాపు దగ్ధం

సింహాచలం, మార్చి 2: జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల సమీపంలో రోడ్డు పక్కనున్న పాన్ షాపు శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. పదిన్నరప్పుడు పాన్‌షాపు దగ్ధమవ్వడాన్ని ఇక్కడ వివాహ వేడుకలో ఉన్న కొందరు గుర్తించి మంటలార్పేందుకు యత్నించడంతో పాటు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

చెరువు లోనుంచి రహదారి నిర్మాణంపై ప్రజల అభ్యంతరం

పనులు నిలిపివేయాలని అధికారులను ఆదేశించిన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


గల్లవానిపాలెంలో చెరువును పూడ్చివేసిన దృశ్యం

అగనంపూడి, మార్చి 2: గల్లవానిపాలెం గ్రామానికి అనుకుని ఉన్న చెరువు లోనుంచి రహదారి నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ చెరువును అనుకుని రోడ్డు ఉన్నప్పటికీ ఇప్పుడు ఎవరి లబ్ధి కోసం చెరువును పూడ్చివేసి రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని పలువురు మేయర్, ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీంతో మేయర్ తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి.

అగనంపూడి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 21/5లో గల్లవానిపాలెం గ్రామాన్ని ఆనుకుని చెరువు ఉంది. గతంలో ఈ చెరువుకు సమీపంలో రెండు అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టారు. వీటి కోసం గతంలో జీవీఎంసీ నిధులు వెచ్చించి 30 అడుగుల మేర రోడ్డును నిర్మించారు. ఈ రహదారికి ఆనుకుని చెరువు ఉండడంతో బిల్డర్ అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకున్నాడు. దీంతో ప్రస్తుతం ఉన్న రహదారిని మరో 20 అడుగుల మేర విస్తరించేందుకు అంచనాలను రూపొందించారు. జీవీఎంసీ నుంచి రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో రోడ్డు విస్తరణ చేపట్టడానికి గాను రెండు రోజుల్లో చెరువును మట్టితో పూడ్చి వేయించారు. కాగా శనివారం రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన చేయించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ క్రమంలో వారిద్దరూ ఇక్కడకు రావడంతో గ్రామస్థులు ఈ రోడ్డు నిర్మాణంపై వారిని నిలదీశారు. చెరువును పూడ్చివేసి ఏ విధంగా రోడ్డు నిర్మాణం చేపడతారని, ఎవరి లబ్ధి కోసం రహదారిని విస్తరిస్తారన్నారు. అపార్ట్‌మెంట్ వాసులకు ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డు సరిపోదా అని ప్రశ్నించారు. రోడ్డు పనులు చేపడతే సహించేది లేదని గ్రామస్థులు స్పష్టం చేశారు. దీంతో మేయర్ రహదారి విస్తరణ పనులను నిలిపివేయాలని అధికారులను ఆదేశించడంతో స్థానికులు శాంతించారు.

కప్ప స్తంభం ఆదాయం రూ.7.6 లక్షలు

సింహాచలం, మార్చి 2: కప్ప స్తంభం ఆలింగనాల ద్వారా వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు గత నెలలో సుమారు రూ.7.6లక్షల ఆదాయం సమకూరింది. దేవాలయ రికార్డుల ప్రకారం గత నెల 30,407 మంది భక్తులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మేరకు రూ.25 టికెట విక్రయాల ద్వారా స్వామివారి ఖజానాకు మొత్తం రూ.7,60,175 ఆదాయం లభించింది.

ముగిసిన 'ఉక్కు' మహిళల క్రీడా పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 2: స్టీల్‌ప్లాంట్‌లో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకమైనదని సీజీఎం (వర్క్స్) ఏకే సోబ్టి అన్నారు. క్రీడా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విజేతలకు బహుమతులందజేశారు. సీజీఎం ప్రకాశ్, విప్స్‌కో-ఆర్డినేటర్ చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు

బీసీ డిక్లరేషన్ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, మార్చి 2: అమరావతిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల ఐదున జరగనున్న బీసీ డిక్లరేషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలపై దాడులు పెరిగిపోయాయని, వారిని అణగదొక్కుతున్నారని విమర్శించారు. బీసీలకు అన్ని విధాల వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. అమరావతిలో జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మిన విజయకుమార్, నూకరాజు, బి.వెంకటరమణ, నమ్మి సింహాద్రి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఎన్.ఎ.డి. జంక్షన్, మార్చి 2: జీవీఎంసీ 90వ వార్డు పరిధి ఏపీఎస్ఈబీ కాలనీ కొండ శివారులో నూతనంగా చేపట్టనున్న సింహగిరి శ్రీనివాసస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు వేంకటేశ్వరస్వామి దీవెనలు ఉన్నందునే అతి తక్కువ సమయంలోనే ఆలయ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయన్నారు. వైసీపీ 'పశ్చిమ' ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సుమారు రూ.నాలుగు కోట్లు ఖర్చవుతుందని కమిటీ సభ్యులు చెప్పారని, తనవంతుగా రూ.20 లక్షలు ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, సింహాచల దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, సీతారామరాజునగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారిత సాధించాలి

పెందుర్తి, మార్చి 2: మహిళలు ఆర్థిక సాధికారిత సాధించాలని నాబార్డ్ డీడీఎం సామంత్‌కుమార్ అన్నారు. శ్రీలిఖి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పెందుర్తిలోని సంఘ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలిఖి ఆధ్వర్యంలో నాబార్డు ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వచ్ఛందంగా స్వయం ఉపాధి యూనిట్ నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించిన పలువురికి అవార్డులను అందజేశారు. బాలికలు, యువతులు, మహిళలకు గైనిక్ సమస్యల నివారణ గురించి డాక్టర్ శిరీష వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీలిఖి సంస్థ కార్యదర్శి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

మద్యనిషేధంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఏ బేగం

సింధియా, మార్చి 2: మద్యనిషేధాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఏ బేగం మండిపడ్డారు. 63వ వార్డులో సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ తాము అధికారంలోకి వచ్చాక మద్యాన్ని నిషేధిస్తామన్న హామీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.జయ,లావణ్యకుమారి,జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

22 మంది 'విజ్ఞాన్' విద్యార్థులకు ఉద్యోగాలు

అగనంపూడి, మార్చి 2: దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న 22 మంది విద్యార్థులు డీ-మార్ట్‌లో రూ.4.75 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. సుధాకర్ విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు తొలి నుంచి విలువలతో కూడిన విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్, సైకలాజికల్, ఎమోషనల్, ఫిజికల్, ఎథికల్ వాల్యూస్‌కు ప్రాధాన్యతను ఇవ్వడం వల్లే విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వి. మధుసూదనరావు, ఉపాధి కల్పనాధికారి బోడే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

కూర్మన్నపాలెం, మార్చి 2: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల ఎనిమిదిన అప్పికొండలో జరిగే వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ ఏడీసీపీ గంగాధరం, ట్రాఫిక్ ఏసీపీ డి.రాజీవ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. శనివారం దువ్వాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐలకు, ఎస్ఐలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అప్పికొండలోని శివాలయం అతి పురాతనమైనది కాబట్టి లక్షలాది మంది భక్తులు విచ్చేసి స్వామిని దర్శించి, జాగరణ తర్వాత సముద్ర స్నానాలు ఆచరిస్తారు కాబట్టి వారికి సేవలందించాలన్నారు. సీఐలు నాగరాజు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఎస్ఐ మహాలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని రక్షించిన లైఫ్ గార్డులు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), మార్చి 2: రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ఇద్దరిని లైఫ్‌గార్డులు రక్షించారు. యమన్ దేశస్థుడు గోబ్రాన్ (38), ఆరిలోవ ప్రాంతానికి చెందిన శివ (17) శనివారం రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగారు. వారు స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద అల వారిని తాకింది. దీంతో వారిద్దరూ కెరటాల్లో కొట్టుకుపోతుండడంతో వారితో పాటు వచ్చిన వారు పెద్దగా కేకలు వేశారు. ఈ మేరకు సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

కలగా హైస్కూల్ ఏర్పాటు

- కొండవాలు గ్రామాలకు అందని ఉన్నత పాఠశాల విద్య
- అప్‌గ్రేడ్‌కు నోచని రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల
- సమస్య పట్టించుకోని పాలకులు, అధికారులు


రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల

కంచరపాలెం, మార్చి 2: జీవీఎంసీ 46,47,48వ వార్డుల పరిధి కొండవాలు గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత పాఠశాల అందుబాటులో లేకపోవడంతో చాలామంది మధ్యలోనే బడికి దూరమవుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా కొండవాలు గ్రామాల్లో అమలుకావడం లేదు. కప్పరాడ, రాంజీ ఎస్టేట్, బాపూజీ నగర్, కైలాసపురం, స్లీపర్ కాలనీ, ఇందిరానగర్ తదితర గ్రామాలకు సంబంధించి రాంజీ ఎస్టేట్‌లో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అందుబాటులో ఉంది. గతంలో ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి కనీసం అప్పర్ ప్రైమరీ పాఠశాలగామార్చాలని స్థానికులు అధికారులకు, నాయకులకు పలువురు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హయాంలో ఇక్కడ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అనేక వినతులు వచ్చాయి. అయితే,నేటికీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే విధంగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఐదో తరగతి వరకు పిల్లలు పాఠశాల్లో చదివి తరువాత ఉన్నత పాఠశాల అందుబాటులో లేక మధ్యలో మానేస్తున్నారు.

ఉన్నత పాఠశాల కోసం హైవేను దాటాల్సిందే..

కొండవాలు గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలకు వెళ్లాంటే కంచరపాలెం మెట్టు వద్ద ఉన్న జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలో చేరాలి. ఆ పాఠశాలకు వెళ్లాలంటే మధ్యలో ఉన్న హైవేను దాటాల్సి ఉంది. ఇలా జాతీయ రహదారిని దాటి వెళ్లేటప్పుడు వాహనాల ఢీకొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు భయపడి విదార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. గతంలో ఇలా ప్రమాదాల బారిన పడి పలువురు ప్రాణాలను కూడా కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అవకాశం ఉన్నవారు ఏదైనా ప్రైవేట్ పాఠశాలలో చేరుతున్నారు. కొండవాలు గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రజల్లో అధికశాతం నిరుపేదలు కావడంతో చాలా మంది బడిబయటే ఉంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిని సారించి రాంజీ ఎస్టేట్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని, కనీసం అప్పర్ ప్రైమరీ పాఠశాలగానైనా అప్‌గ్రేడ్‌చేస్తే కొంతవరకు చదువుకునే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుజాత

సీతంపేట, మార్చి 2: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో ర్యాలీని నిర్వహించారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య అతిథిగా ప్రాంతీయ వైద్య ఆరోగ్యసంచాలకులు బి.సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.జీవన రాణి, జిల్లా ప్రోగ్రాం అధికారులు బి.నాగేశ్వరరావు, ధర్మేంద్ర ఉన్నారు.

నేడు పల్స్ పోలియో కార్యక్రమం

- జిల్లాలో 2,08,163 మంది చిన్నారులు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు వయసున్న 2,08,163 మంది చిన్నారులకు 1,002 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. ఇందుకోసం 74 మొబైల్ బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలకు టీకా డోసులు పంపిణీ చేశామని, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డెమో నాగేశ్వరరావుతో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వివరించారు.

వైసీపీ కార్పొరేటర్ భర్త దందా

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేశారు. విషయం తెలియగానే నక్కవానిపాలెం గ్రామస్థులు అక్కడకు చేరుకుని గొడవకు దిగారు. అయినప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. దీనిపై గ్రామస్థులు ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజుకు, స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డికి ఫిర్యాదు చేయగా...వారంతా వెళ్లి కోర్టులో కేసు ఉన్నందున పనులు చేపట్టవద్దని బిల్డర్‌ను ఆదేశించి వెళ్లిపోయారు. మరుసటిరోజు రాత్రి మళ్లీ బిల్డర్ అక్కడకు చేరుకుని తాను అపార్టుమెంట్ కోసం నిర్మించిన సీసీ రోడ్డును నక్కవానిపాలెం ప్రధాన రహదారికి అనుసంధానించేందుకు వీలుగా జీవీఎంసీ నిర్మించిన ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసి, వాహనాలు సులభంగా అపార్టుమెంట్‌వైపు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులను నిర్మించారు. దీంతో గ్రామస్థులు మరోసారి అక్కడకు చేరుకుని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడకు చేరుకుని కోర్టులో వివాదం కొలిక్కి వచ్చేంత వరకూ ఎలాంటి పనులు చేపట్టవద్దని చెప్పి...అక్కడి నుంచి వెనుతిరిగిపోయారు. ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేయడంతోపాటు మెయిన్‌రోడ్డుపై కాంక్రీట్ వేసి ర్యాంప్ నిర్మించారనే కారణంతో క్రిమినల్ కేసు పెట్టాల్సి ఉన్నప్పటికీ బిల్డర్ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త కావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం దాల్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ కావడంతో బిల్డర్ బరితెగించి వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై బిల్డర్, వైసీపీ కార్పొరేటర్ భర్త అప్పారి గిరిబాబు వివరణ కోరగా, ఏడుగుళ్ల అనుకుని ఉత్తరం వైపు నుంచి 30 అడుగులు రోడ్డు ఉన్నందున అది చూపించి జీవీఎంసీ నుంచి 2014లో అపార్టుమెంట్ నిర్మాణానికి ప్లాన్ పొందామన్నారు. దీనిపై గ్రామస్థులతోపాటు మరికొందరు కోర్టులో కేసులు వేసినప్పటికీ తామే గెలిచామన్నారు. తాజాగా రోడ్డు నిర్మించడంతో కొంత మంది తాగుబోతులు కావాలనే గొడవకు దిగుతున్నారన్నారు. కోర్టులో కేసులు గెలిచినప్పుడు అపార్టుమెంట్ నిర్మాణం ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించగా, తనకు డెవలప్‌మెంట్‌కు స్థలం ఇచ్చిన వారు ఎక్కువ ఫ్లాట్‌లు కావాలని డిమాండ్ చేశారని, దీనివల్ల గొడవ వచ్చి నిర్మాణం ఆగిందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి వివాదం లేకపోతే బయటకు కనిపించకుండా ఫ్లెక్సీలు, పాతవాహనాలను అడ్డంగా ఎందుకు పెట్టారని ప్రశ్నించగా...రాత్రిపూట గంజాయి బ్యాచ్‌లు, మందుతాగేవారు అపార్టుమెంట్ వైపు వెళ్లకుండా పెట్టామని సమాధానం చెప్పడం గమనార్హం.

అలల తాకిడికి ఫ్లోటింగ్ బ్రిడ్జి తలకిందులు

... 5వ పేజీ తరువాయి

పెట్టుకోవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఇంకొక దగ్గరకు మార్చాలంటే అనుమతులు అవసరమవుతాయని, దానికి జాప్యం జరుగుతుందని ఆలోచన చేస్తున్నారు. ఆర్కే బీచ్ వద్ద సముద్రం ప్రశాంతంగా ఉండడం చాలా అరుదు. అలలు తీరాన్ని ఢీకొడుతూనే ఉంటాయి. అక్కడే ఫ్లోటింగ్ బ్రిడ్జిని కొనసాగించాలనే ప్రయత్నం కంటే..సురక్షితమైన ప్రాంతంలో నిర్వహించడం ఎంతో మేలు. ఈ ప్రాజెక్టు కారణంగా పర్యాటకులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఇవీమీ అధికారులకు అర్థం కావడం లేదు.

అధికార అరాచకం

... 5వ పేజీ తరువాయి

భూమిలో ఉన్న జీడిచెట్ల ఫలసాయం తీసుకుంటూ ఉండేవారు. ఇదిలావుండగా గ్రామానికి రైతుభరోసా కేంద్రం మంజూరుకావడంతో నిర్మాణానికి రహదారికి ఆనుకుని ఉన్న 70/2లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామంలో వైసీపీ నేతలు చెప్పారని 1.04 ఎకరాల్లో 30 సెంట్లు రైతుభరోసా కేంద్రం ఏర్పాటుకు ఇవ్వడానికి అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు ముందుకువచ్చి అగ్రిమెంటు రాసి ఇచ్చారు. దీంతో రైతుభరోసా కేంద్రం నిర్మించిన వైసీపీ నేత, అక్కడే సుమారు 10 నుంచి 15 సెంట్లలో సొంతంగా రేకుల షెడ్లు నిర్మించారు. దీనిపై అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు అభ్యంతరం చెబుతూ ఆనందపురం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత తన భూమిలో కొబ్బరి మొక్కలు నాటుకున్నారు. అయితే...వైసీపీ నేత రేకుల షెడ్లు నిర్మించినప్పుడు స్పందించని రెవెన్యూ అధికారులు... ఈశ్వరరావు నాటిన కొబ్బరి మొక్కలు తొలగించి అది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డు పాతారు. ప్రస్తుతం పాతిన బోర్డును తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడానికి వైసీపీ నేత రంగం సిద్ధం చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ కీలక నేతల ఆశీస్సులు ఉండడంతో సర్వేనంబరు 70/2లో మిగిలిన భూమి కబ్జాకు యత్నిస్తున్నారని డి.పట్టా పొందిన రైతు వారసుడు ఈశ్వరరావు రెండు రోజుల కిందట జిల్లా కలెక్టర్, భీమిలి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అయితే సర్వేనంబరు 70/2లో భూమి ప్రభుత్వ భూమి అని ఆనందపురం రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు లెంక అచ్చిబాబు కుమారుడు ఈశ్వరరావు నుంచి 30 సెంట్లు భూమి రైతుభరోసా కేంద్రానికి ఎందుకు తీసుకున్నట్టు?... ఇంకా అక్కడే గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత షెడ్లు నిర్మించినప్పుడు ఎందుకు అడ్డుచెప్పలేదు?...అంటే సమాధానం లేదు. సర్వే నంబరు 70/2లో రైతు భరోసా కేంద్రం నిర్మించగా మిగిలిన 60 సెంట్లను కాజేయడానికి వైసీపీ నేతతో రెవెన్యూలో కొందరు స్కెచ్ వేశారా?...అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, జిల్లా కలెక్టర్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గ్రామస్థులు అంటున్నారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

డబ్బులు గుంజుతున్నట్టు ఫిర్యాదు అందడంతో అతడితోపాటు అతని అనుచరుడైన మనోజ్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి డమ్మీ తుపాకీతోపాటు పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు మరికొందరు రౌడీషీటర్లపై కూడా ఫిర్యాదులు అందుతుండడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా పెట్టాలని సంబంధిత స్టేషన్ల సీఐలను ఆదేశించారు. ఒకవేళ రౌడీషీటర్ ఏదైనా నేరంలో పాల్గొన్నట్టు తేలితే సంబంధిత స్టేషన్ సీఐతో పాటు బాధ్యుడైన కానిస్టేబుల్‌పై కూడా చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. దీంతో అన్ని స్టేషన్ల పరిధిలోనూ రౌడీషీటర్ల జాబితాతోపాటు ఎవరెక్కడ ఉంటున్నారనే వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



విశాఖ నా పుట్టిల్లు

- వైసీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయ కర్త బొత్స ఝాన్సీ


కనకమమహాలక్ష్మి పూజల్లో బొత్స ఝాన్సీ, మంత్రి అమర్‌నాథ్ తదితరులు

జగదాంబ కూడలి, మార్చి 2: 'విశాఖ నగరం నా పుట్టిల్లు.. ఈ నేపథ్యంలో ఈ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి తప్పక గెలుస్తాను' అని వైసీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఎంపీగా వైసీపీ నుంచి పోటీ చేయనున్నానని, ఇక్కడి ప్రజలు తనను గెలిపిస్తారన్నారు. విలేకరులకు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా విశాఖకు తాను వలస రాలేదని, ఇది తాను పుట్టిన ఊరని ఆమె తెలిపారు. అర్చకులు సమక్షంలో బొత్స ఝాన్సీ కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే వాసుపల్లి, నాయకులు, కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

నేడు మురళీనగర్‌లో ప్రచారానికి శ్రీకారం

మురళీనగర్; విశాఖ ఎంపీగా రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్న బొత్స.ఝాన్సీ ఆదివారం మురళీనగర్ నుంచి ఎన్నికల ప్రచారం ఆరంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్‌జీజీఓస్ కాలనీ శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేపట్టి, అక్కడి నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్టు నాయకులు తెలిపారు. అనంతరం మధుసూదన్‌నగర్, కస్తూరినగర్ ప్రాంతాల నుంచి ప్రజల్లోకి వెళ్లనున్నారు.

సూక్ష్మ పరిశ్రమలపై సర్వే పరిశీలన


ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల కార్యదర్శి యువరాజు

కంచరపాలెం, మార్చి 2 : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు మెరుగుపరచటం, పరిశ్రమల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై అభిప్రాయాలను సేకరించే నిమిత్తం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎస్.యువరాజు శనివారం కంచరపాలెంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలకు సంబంధించి సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యకమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి ఉన్నారు.

'ఇంటర్ విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి'

అక్కయ్యపాలెం, మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదరాబాదరాగా పరీక్ష కేంద్రాలకు అతి కష్టంగా చేరుకుంటున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ పరీక్షల ఆలస్యంగా చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

నేడు బుల్లయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు


మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార, మార్చి 2: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఉన్నత సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ విద్యనందించి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకునేలా తీర్చిదిద్దామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అన్నారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1973లో కేవలం రెండు తరగతి గదులతో 230 మంది విద్యార్థులతో కళాశాలను ప్రారంభించామన్నారు. అనంతరం దశ దిశలా అభివృద్ధి చెందిందన్నారు. అలాగే, ఈ 50 ఏళ్ల వేడుకలకు 4,500 మందికిపైగా విద్యార్థులు స్వాగతం పలుకునున్నారన్నారు. ఐదు దశాబ్దాలపాటు విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేశామన్నారు. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు భరత్, వేణుగోపాల్ ఇండియన్ క్రికెట్ టీమ్‌లో ఆడారన్నారు. ఏపీలో అతి పెద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాన్ని కలిగి ఉందన్నారు. ప్రస్తుతం తమ కళాశాల ఆంధ్రా యూనివర్శిటీ అనుబంధంగా ఎన్ఏసీ వారి ఏ గ్రేడ్ అక్రిడేషన్ కలిగి స్వయం ప్రతిపత్తి హోదాలో ఉందన్నారు. కళాశాల స్వర్ణోత్సవాలు గ్రాండ్ ఫినాలేతో ముగుస్తాయన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, రియాజ్ మహ్మద్, డాక్టర్ జీవీఎస్‌కే చక్రవర్తి, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వర రెడ్డి, పూర్వ విద్యార్థులు అబ్దుల్ హమీద్‌ఖాన్, విద్యాసాగర్, అమీద్ బట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

'బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాలి'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భిక్షువు రాజధమ్మా, ఇతరులు

సీతంపేట, మార్చి 2: బుద్ధుని జీవితంతో పెనవేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందని మాజీ వీసీ పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కేఎస్ చలం రచించిన బౌద్ధ విజ్ఞానం- లౌకిక జీవనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ ఫిలాసఫీ శాఖాధిపతి ప్రొఫెసర్ వి.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మయన్మార్‌కు చెందిన భిక్షువు రాజధమ్మా విచ్చేశారు. అనేక పుస్తకాలు, పరిశోధన గ్రంథాలు పరిశీలించి ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచినట్లు చలం అన్నారు. మాజీ వీసీ ముత్యాల నాయుడు, ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు, వై. విజయకుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ సత్యనారాయణ మూర్తి, మాటూరి శ్రీనివాస్, ఆరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

హరిరామజోగయ్య తీరు సరికాదు: జనసేన


మాట్లాడుతున్న జనసేన పార్టీ సమన్వయ కర్త నాగలక్ష్మి

సీతంపేట, మార్చి 2: ఎంపీ హరిరామజోగయ్య రాష్ట్ర ప్రజల మంచిని కోరుకోవాలని, కానీ, ఆయన వైసీపీ అరాచకాలకు కొమ్ము కాస్తుండడం శోచనీయమని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్తలు కిరణ్ ప్రసాద్, నాగలక్ష్మి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. ఇన్ని రోజులూ ఆయన మాట్లాడిన మాటలకు, ఆయన రాసిన లేఖలకు వారి కుమారుడు వెళ్లి వైసీపీ కండువా కప్పుకోవడంతో ఆయన ఉద్దేశమేమిటో తేట తెల్లమైందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంటే అది మంచిది కాదని చెప్పాల్సింది పోయి ఆయన అధికార వైసీపీకి వంతపాడడం దుర్మార్గమన్నారు. కాపుల అభివృద్ధి కోసం పాటుపడాలనుకుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు బాసటగా నిలబడాలన్నారు. రాజకీయ దురుద్దేశంతో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. నేతలు సోమశేఖర్, చైతన్య, భార్గవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్: ఏడీసీపీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీతమ్మధార, మార్చి 2: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఏడీసీపీ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సత్యం జంక్షన్‌లో ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎన్‌వీ భాస్కరరావు, ట్రాఫిక్ సిబ్బంది, పాత్ర అనే సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై ప్లకార్డుల ప్రదర్శనను నిర్వహించారు. సిగ్నల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వారికి ఏడీసీపీ చేతుల మీదుగా స్టీల్ వాటర్ బాటిల్‌ను బహుమతిగా ఇచ్చారు.

వేణుగోపాలస్వామి ఆలయ అర్చకునిపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న దేవదాయ శాఖ ఏసీ శిరీష

అక్కయ్యపాలెం, మార్చి 2: అక్కయ్యపాలెం వేణుగోపాల స్వామి ఆలయం అర్చకులు పీవీ అప్పలచార్యులుపై శనివారం ఆలయం ఆవరణలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష ఆధ్వర్యంలో ప్రజా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏసీ శిరీష మాట్లాడుతూ అర్చకుడు కార్తీకమాసంలో ఆకాశ దీపం పెట్టలేదని, అష్టోత్తరం పూర్తిగా చెప్పలేకపోతున్నారనే ఆరోపణలపై విచారణ చేశామన్నారు. దీనిపై అతనిని సంజాయిషీ కోరగా, సమాధానం చెప్పకుండా విచారణ మధ్యలో వెళ్లిపోయారన్నారు. ఆ తరువాత వారి కుటుంబసభ్యులు వచ్చి, అప్పలచార్యులు నిద్రమాత్రలు మింగి ఆత్మాహత్యయత్నం చేశారని బెదిరిస్తూ, వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేశారన్నారు. దీనిపై నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తామన్నారు. విచారణలో ఆలయ చైర్మన్ వై.దేముడు, ధర్మకర్తల మండలి సభ్యులు చంద్రకళ, కేఎస్‌కేఎస్ సూర్యకళ, ఈవో పి.సత్యనారాయణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

'బయటకు పంపించేందుకే కుట్ర'

తన తండ్రి 1984 నుంచి అర్చకునిగా పనిచేస్తున్నారని పీవీ అప్పలచార్యులు కుమారుడు లక్ష్మీనారాయణ తెలిపారు. కమిటీ సభ్యులు ఎలాగైనా తన తండ్రిని బయటకు పంపాలని నిర్ణయించుకుని ఫిర్యాదులు చేశారన్నారు. ఆలయ చైర్మన్‌తోపాటు మరో ముగ్గురు వేధిస్తున్నారన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 2: స్థానిక భీమునిగుమ్మంకు చెందిన డాక్‌యార్డు ఉద్యోగి గొర్లి దివాకర్ (32) శనివారం మృతి చెందారు. పట్టణ ఎస్ఐ మహ్మద్ ఆలీ అందించిన వివరాలివి.. అవివాహితుడైన దివాకర్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ తన మేనత్త ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం విధులకు వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఆరు గంటలకు కాఫీ తాగిన అనంతరం బయటకు వెళ్లి వచ్చాడు. తర్వాత నోటి నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని మృతుని సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన


విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 2: ప్రాథమిక విద్యార్థి దశ నుంచి చిన్నారులకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆర్టీఎస్ ఆశాజాస్తి, ఆర్టీఎస్ కరుణ పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, విద్య , పౌష్టికాహారం, ఆరోగ్యం అంశాలపై రోటరాక్ట్ క్లబ్ వైజాగ్ కపుల్స్ , సన్ ఇంటర్నేషనల్ నిర్వహణలో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ యూత్ సర్వీస్ బృందం అవగాహన కల్పించింది. విద్యార్థులకు ఆట వస్తువులు, పౌష్టికాహార ప్యాకెట్స్‌ను అందజేశారు.

'సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం'

సీతమ్మధార, మార్చి 2: సంక్షేమ పథకాలు పంపిణీలో వలంటీర్లు పాత్ర కీలకమని వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పేర్కొన్నారు. నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం ఆవరణలో 14, 24, 25వ వార్డుకు సంబంధించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానంచేశారు. కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, మురళీకృష్ణ రెడ్డి, ఏపీడీ దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ...

కంచరపాలెం: జీవీఎంసీ 47,48వ వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను కె.కె. రాజు శనివారం పంపిణీ చేశారు. సుగుణకుమార్, కంటిపాము కామేశ్వరి, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

41వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ

జ్ఞానాపురం, మార్చి 2: జ్ఞానాపురంలో లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాశ్రీధర్ ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ యూసీడీ సీవో సత్యవతి, సచివాలయ సిబ్బంది లక్ష్మీనారాయణ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

భీమునిపట్నం, మార్చి 2 : పట్టణంలోని 3, 4 వార్డుల్లో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్యాధికారులు తెలిపారు. వార్డు 3లో తోట వీధి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో 18 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆవార్డులో ఐదేళ్లలోపు చిన్నారులు 1352 మంది ఉన్నట్టు గుర్తించారు. అలాగే చేపలుప్పాడ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో 17 బూత్‌లు ఏర్పాటు చేయగా ఆ వార్డులో 1400 మంది చిన్నారులు ఉన్నట్టు గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ.7.6 లక్షలు

సింహాచలం, మార్చి 2 : కప్ప స్తంభం ఆలింగనాల ద్వారా వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు గత నెలలో సుమారు రూ.7.6లక్షల ఆదాయం సమకూరింది. దేవాలయ రికార్డుల ప్రకారం గత నెల 30407 మంది భక్తులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు రూ.25 టికెటు విక్రయాల ద్వారా స్వామి వారి ఖజానాకు మొత్తం రూ.7,60,175 ఆదాయం లభించింది.

అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం



సింహాచలం, మార్చి 2 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణానికి భక్తుల నుంచి విశేష ఆద రణ లభిస్తోంది. శనివారం జరిగిన నిత్య కల్యాణంలో 25 జంటలు పాల్గొన్నాయి. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు చేసి స్వామివారికి షోడశోపచారాలు సమర్పించారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గరుడసేవ

వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా గరుడ సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభాత ఆరాధనల తరువాత ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. మంగళవాయిద్యాల వెంట గరుడ వాహనంపై ఉన్న స్వామివారి చుట్టూ భక్తులు ముమ్మారు ప్రదక్షిణలు జరిపారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

ఆరిలోవ, మార్చి 2 : కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రంలో 482 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 480 మంది హాజరైనట్టు కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ బీకే రమేష్ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

తగరపువలస, మార్చి 2 : చిట్టివలసలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలికలకు వివిధ అంశాలపై ఉచిత శిక్షణ అందిస్తున్నామని సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో 5 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు ఈ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మానవతా విలువలు. భారతీయ సంస్కృతి, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు చిట్టివలసలో ఉన్న తమ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 20, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



గుంతలమయమైన గంధవరం- అలమండ వెళ్లే రహదారి



కంకరతేలి అధ్వానంగా ఉన్న కొవ్వాడ వెళ్లే రోడ్డు

పల్లెల్లో ప్రయాణ పాట్లు

- అత్యంత దారుణంగా గ్రామీణ రహదారులు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- రాకపోకలకు ప్రజలు అవస్థలు

పద్మనాభం (రూరల్), మార్చి 2 : మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అడుగడునా గోతులు, కంకర తేలిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంట గ్రామం నుంచి కొవ్వాడకు వెళ్లే రోడ్డు పూర్తిగా కంకర తేలి, పెచ్చులూడి ఉంది.అర్చుకునిపాలెం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ స్కూల్‌కు వెళ్లే రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే భయం గొలుపుతోంది. తేలిన కంకర వల్ల బైక్‌లు అదుపు తప్పి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సింహాచలం-విజయనగరం ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కొవ్వాడ నుంచి అలమండ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి దుస్థితి కూడా ఇంతే. రోడ్డు పూర్తిగా పాడై ఎక్కడిక్కడ గోతులతో ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో వాటిలో వాహనాలు పడి ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంటోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

కొమ్మాది, మార్చి 2 : బొట్టవానిపాలెంలో 15 రోజులుగా జరుగుతున్న ఎంసీబీ క్రికెట్ పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ పోటీల్లో మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 24 జట్లు పాల్గొనగా చంద్రంపాలెం విజేతగా నిలిచింది. నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పిల్లా ఆనంద్, పోతిన ఆనంద్, పొలమాటి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం కూడలిలో బడ్డీల తొలగింపు

సాగర్‌నగర్, మార్చి 2 : జీవీఎంసీ 8వ వార్డు తాటిచెట్లపాలెం కూడలిలో శనివారం బడ్డీలను తొలగించారు. ఈప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు చేసింది. ఈమేరకు అధికారులు నెల రోజుల క్రితమే వ్యాపారులకు బడ్డీలు తొలగించాలని సూచించారు. కానీ వారు స్పందించకపోవడంతో పట్టణ ప్రణాళికా విభాగం బడ్డీలను తొలగించింది.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



ఎండాడలో లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం/ఎండాడ, మార్చి 2 : ముఖ్యమంత్రి జగన్ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఆనందపురం, చందక పంచాయతీల్లో జగనన్న రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పాలన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకట్రావు, నాయకులు మజ్జి వెంకట్రావు, బంక సత్యన్నారాయణ, సర్పంచులు చందక లక్ష్మి, బంక శ్రీను పాల్గొన్నారు. ఎండాడలోని ఎస్సీ కాలనీలో జరిగిన కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పారావు, వైసీపీ నాయకులు పోలిరెడ్డి. మెంబర్ గోపి, మాదు రాజు. ఎర్రిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బోర్డు



గిరిజన్ భవన్ కూడలిలో ఉన్న బోర్డు

ఎంవీపీ కాలనీ, మార్చి 2 : ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన బోర్డు ప్రాణాల మీదకు తెస్తోంది. సదరు సంస్థ అనాలోచితంగా ఫుట్‌పాత్ మీద ఏర్పాటు చేసిన బోర్డు చాలామందికి ప్రమాదకరంగా మారింది. జీవీఎంసీ అధికారులు కూడా దీన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. గిరిజన్ భవన్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ బోర్డు వల్ల ఫుట్‌పాత్‌పై నడిచే వారి తలకు బోర్డు కోణం తగులుతోంది. దీనివల్ల చాలామంది చిన్నపాటి గాయాలతో తప్పించుకుంటుండగా, ఏదో ఒక రోజు ఇది ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంది. అధికారులు తక్షణమే స్పందించి బోర్డును తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదానికి గురైన యమన్ దేశస్థుడు, ఆరిలోవ యువకుడుతో లైఫ్‌గార్డులు

ఇద్దరిని రక్షించిన లైఫ్ గార్డులు

సాగర్‌నగర్, మార్చి 2 : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ఇద్దరిని లైఫ్‌గార్డులు రక్షించారు. యమన్ దేశస్థుడు గేబ్రాన్ (38), ఆరిలోవ ప్రాంతానికి చెందిన శివ (17) శనివారం రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగారు. వారు స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద అల వారిని తాకింది. దీంతో ఇద్దరూ కెరటాల్లో కొట్టుకుపోతుండడంతో వారితో పాటు వచ్చిన వారు పెద్దగా కేకలు వేశారు. ఈమేరకు అక్కడికి సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డులు వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చారు.

పిల్లలకు క్రీడలపై ఆసక్తి ఉండాలి : దిశ ఏసీపీ

మద్దిలపాలెం, మార్చి 2 : పిల్లలకు పాఠశాల విద్య నుంచే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉండాలని దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ వివేకానంద అన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం జరిగిన గురుస్థానం ప్లే స్కూల్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. పిల్లల చదువులో తల్లుల పాత్ర కీలకమని, ఇంటి వద్ద వారు శ్రద్ధ తీసుకుంటే ఉత్తమ విద్యార్థులుగా తయారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉషాశ్రీ, వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫరూఖి, స్కూల్ డైరెక్టర్ ఎస్. ఖాన్, ఈడీ నిషా, ప్రిన్సిపాల్ గౌసియా బేగం పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో మీడియా సెంటర్లు



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న భాస్కర్

మద్దిలపాలెం, మార్చి 2 : డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీపరమైన బోధన అందించేందుకు మీడియా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని కళాశాల విద్యాశాఖ కమిషనర్ పి. భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా విద్యార్థులు క్లాసులు వినేందుకు రాష్ట్రంలో ఎన్ఆర్‌సీలుగా గుర్తించిన ఆరు డిగ్రీ కళాశాలల్లో మీడియా సెంటర్లు ప్రారంభించామన్నారు.ఈ కేంద్రాల్లో అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధిస్తారని, వారి బోధనను రికార్డు చేసి కళాశాలల యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. తద్వారా విద్యార్థులు యూట్యూబ్ ఛానెల్‌లో ఎప్పుడైనా వీక్షించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కోఆర్డినేటర్లు శ్రావణ్‌కుమార్, టి. శ్యామ్యుల్ డేవిడ్ రాజ్, అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

ఆరిలోవ, మార్చి 2 : ఆరిలోవలో పచ్చదనం కనుమరుగవుతోంది. ఎవరికి తోచిన విధంగా వారు చెట్లను నరికివేస్తున్నారు. జీవీఎంసీ అధికారుల నుంచి కనీసం స్పందన లేకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 19 వ వార్డులో విచ్చలవిడిగా చెట్లు తొలగిస్తున్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని సంజయ్ గాంధీ కాలనీలో షిర్డీసాయి సంస్థాన్ మందిరం భక్తులకు కనిపించడం లేదని అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, చెట్లు నరికివేస్తున్నారు. ఈ మార్గంలో చెట్లు విరివిగా ఉండి బాటసారులు, వాహనదారులకు నీడనిస్తున్నాయి.వాటిని కేవలం గుడి కనిపించడం లేదన్న నెపంతో తొలగిస్తున్నారు. గతంలో కూడా సుమారు 20కి పైగా చెట్లు నరికివేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల మరికొన్ని చెట్లు తొలగించారు. చెట్లు నరకాలంటే సంబంధిత డిప్యూటీ డైరెక్టర్ హారికల్చర్ అనుమతి ఉండాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా చెట్లను తొలగించడం పట్ల వృక్ష ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయం ముందున్న చెట్టును నరికివేస్తున్న దృశ్యం

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

పద్మనాభం, మార్చి 2: మండలంలో 43 కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నట్టు ఎంపీడీఓ బి. శైలజ తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో పల్స్‌పోలియో నిర్వహణపై ఐసీడీఎస్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3292 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. దీనికి 86 బృందాలు విధులు నిర్వర్తించనున్నట్టు చెప్పారు. ఈనెల 4, 5 తేదీల్లో కూడా ఇంటింటికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు.

ప్లాట్ల మధ్య తుప్పలు తొలగింపు

మధురవాడ, మార్చి 2 : ఎవరో వచ్చి.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కాలనీవాసులందరూ ఒక్కటయ్యారు..తమ ఇళ్ల పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలను తొలగించారు. 1990లో మిథిలాపురి వుడాకాలనీలో 1400 ప్లాట్లను వుడా విక్రయించింది. 2023 నాటికి సుమారు 500 ప్లాట్లులో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మిగతా వారు ప్లాట్లు చుట్టూ ప్రహరీలు నిర్మించి అలాగే వదిలేశారు. దీంతో ఆ స్థలాల్లో తుప్పలు, మొక్కలు భారీగా పెరిగిపోవడంతో పాముల సంచారం అధికమైంది. దోమల వ్యాప్తి కూడా ఎక్కువగా ఉంది. కాలనీవాసులు ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా..ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తామే సమస్యకు పరిష్కారం వెతుక్కోవాలని నిర్ణయించుకొని, యునైటెడ్ సొసైటీగా ఏర్పాటయ్యారు.కాలనీవాసులు వడ్లమాని శ్రీనివాసరావు, కేఎస్ ప్రసాద్, దూబ వసంతకుమార్, ప్రసాదరావు, బాలాజీ, కేదారిశెట్టి నాగేశ్వరరావు, దాడిశెట్టి అప్పారావు, బలివాడ రోజా తదితరులు మూడు రోజుల పాటు శ్రమించి, ఖాళీ స్థలాల్లో తుప్పలు, డొంకలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

గోశాల కూడలిలో పాన్‌షాపు దగ్ధం



సింహాచలం, మార్చి 2 : జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల సమీపంలో రోడ్డు పక్కనున్న పాన్ షాపు శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. రాత్రి 10.30 గంటల సమయంలో కల్యాణ మండపానికి చేరువలో ఉన్న పాన్ షాపు నుంచి దట్టమైన పొగలు వెలువడి పరిసరాల్లో విస్తరించాయి. వివాహ వేడుకలో ఉన్న కొందరు విషయాన్ని గమనించి ఆర్పేందుకు యత్నించడంతో పాటు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్టు షర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి నట్టు తెలిసింది. షాపులోని వస్తువులన్నీ కాలిపోయాయి.



పీఎంపాలెం రహదారిలో దుస్థితి

పీఎం పాలెంలో క్షీణించిన పారిశుధ్యం

కొమ్మాది, మార్చి 2 : జీవీఎంసీ జోన్-2 పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా పీఎంపాలెం ప్రధాన రహదారిలో కాలువలు మురుగుతో నిండిపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. మరోవైపు చెత్త సేకరించి ఆ చెత్తను తరలించాల్సిన పారిశుధ్య కార్మికులు ఎక్కడికక్కడ తగలబెట్టడంతో కాలుష్యం ఏర్పడుతోంది.పీఎంపాలెం ప్రధాన రహదారిలో షిర్డీ సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గంలో చేపల వ్యర్థాలు రోడ్డుపై వదిలేయడంతో దుర్వాసనకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే క్రికెట్ స్టేడియం ఎదురుగా చెత్తను తరలించకుండా జాతీయ రహదారిని ఆనుకుని చెత్త కుప్పలు ఉంచి రోడ్డు మీద కనపడకుండా వాటిని చెట్ల తీగలు, ఆకులతో కప్పివేస్తున్నారు. గతంలో వారంలో ఒకరోజు జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించేవారు. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. దీంతో రోజురోజుకి పారిశుధ్యం క్షీణిస్తోంది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బీపీ చెక్ చేయించుకుంటున్న శ్రీకంఠనాథరెడ్డి

ఆరిలోవ,మార్చి 2 : ఆహారం తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే చిన్నవయసులోనే స్థూల కాయత్వం వచ్చే అవకాశం ఉందని అటవీ శాఖ సీసీఎఫ్ శ్రీ కంఠనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన జూపార్కులో సదరన్ విద్యా సంస్థలు, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల సంయుక్తంగా పౌష్టికాహారం ఆవశ్యకతపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. సదరన్ గ్రూప్ సహకారంతో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జూపార్కు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, డీసీఎఫ్,మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సదరన్ ఎడ్యుకేషనల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది జనార్దనరావు

భీమునిపట్నం, మార్చి 2 : రాజ్యాంగం విలువలను కాపాడగలడన్న నమ్మకం ఉన్న వారినే పాలకులుగా ఎన్నుకోవాలని భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెయిగాపుల జనార్దనరావు అన్నారు.శనివారం స్థానిక ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఓం కారేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సహకారంతో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అసెంబ్లీకి, పార్లమెంట్‌కి ఎన్నికైన వారిలో కొందరు తాము ప్రజాసేవకులమన్న విషయాన్ని మరిచిపోయి, ప్రజలపై పెత్తనం చేయడం గమనించాల్సిన విషయమన్నారు. దేశంలో గాని, రాష్ట్రంలో గాని రాజ్యాంగబద్ధమైన పాలన కొరవడుతుందని, ప్రజలు మనకెందుకులే అనుకోవడం వల్లే ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతిఒక్కరూ ఓటు వేసే ముందు ఏ వ్యక్తులు సేవాభావం గలవారో గమనించి వారినే ఎన్నుకోవాలన్నారు. ఓంకారేశ్వర సేవా సంఘం అధ్యక్షుడు పల్లా భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల, సోషల్ వర్కర్స్ సత్తరవు వాయునందనరావు, కంటుభుక్త శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో కారు బోల్తా

భీమునిపట్నం, మార్చి 2 : బీచ్ రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బల సమీపంలో వున్న రెస్టారెంట్ మలుపులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కారు బోల్తా పడింది. నగరంలో పనోరమా హిల్స్ ప్రాంతం నుంచి అతి వేగంగా వస్తున్న కారు మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తా పడింది. కారులో ఒకరు మాత్రమే ఉన్నారు. అతడు సురక్షితంగా బయటపడడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

8న గాయత్రి ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

కొమ్మాది, మార్చి 2 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న గాయత్రి విద్యాపరిషత్ ఆస్పత్రిలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డీన్ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రొమ్ము కేన్సర్‌కు సంబంధించిన మెమోగ్రామ్ పరీక్ష, షుగర్ లెవల్‌కు సంబంధించి హెచ్‌బీఏ 1సీ పరీక్ష, ఎముకలకు సంబంధించి బోన్ మినరల్ డెన్సిటీ పరీక్ష ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాతృశ్రీ బిల్డర్స్ ప్రతినిధులు

కొమ్మాది, మార్చి 2 : వేసవి మొదలు కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాతృశ్రీ ట్రస్టు అధినేత పోతిన శివ అన్నారు. శనివారం ఆయన బక్కన్నపాలెంలో మాతృశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలివేంద్రం మూడు నెలలు పాటు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరపు శ్రీనివాస్, పోతిన మురళీ, దుక్క అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు

సిరిపురం, మార్చి 2 : శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం ఆలయ కార్యాలయం ఆవరణలో నిర్వహించినట్టు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. గత 28 రోజులకు గాను రూ.21,78,208 నగదు, బంగారం 4 గ్రాముల 357 మిల్లీ గ్రాములు, వెండి 168 గ్రాముల 300 మిల్లీగ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 16, మలేషియా రింగ్గిట్ 26, ఇంగ్లాండ్ పౌండ్ 10, కువైట్ 1 దీనార్, ఎస్‌బీఐ చెక్కు రూ.111వచ్చినట్టు తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయశాఖ తనిఖీదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పీవీపై నాలుగు మంచి మాటలు'

సిరిపురం, మార్చి 2 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం దసపల్లా హోటల్‌లో పీవీపై నాలుగు మంచి మాటలు అనే కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఎంవీవీ, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సీనియర్ న్యాయవాది సోమయాజులు హాజరుకానున్నట్టు చెప్పారు.